సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం : 30 : జూలై : 2025



ప్రయోజనాలు అందించాలి
యూనివర్సిటీలు విద్యార్థులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించాలని విద్యా కమిషన్ చైర్మన్ మురళి అన్నారు. - 8లో



ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ
వడపర్తిలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతిచెందాడు. - 8లో



ప్రయాణించేదెలా..
జంగంపల్లి -యాదగిరిగుట్ట రోడ్డంతా గుంతలమయంగా మారి ప్రయాణించేందుకు వీలు లేకుండా ఉంది. - 9లో

న్యూస్‌రీల్

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయాల్లో సింధూరంతో పాటు పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చన జరిపించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా జరిగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు కొనసాగాయి.

ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలి



ఆలేరురూరల్ : శారాజీపేట పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆలేరురూరల్ : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుచాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవాం ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని అన్ని రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మంతపురిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, వెంటర్నరీ హెల్త్ క్యాంపులో గొర్రెలకు వేస్తున్న బ్లూ టంగ్ వాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట వెంటర్నరీ అధికారి డాక్టర్ పి.చైతన్య, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

యాదగిరిగుట్ట రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. కొత్త అడ్మిషన్‌లు గురించి ఆరా తీసి మాట్లాడారు. ఆయన వెంట హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

గౌస్‌కొండలో కేంద్ర బృందం పర్యటన

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో మంగళవారం కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సర్వే నిర్వహించింది. సర్వే బృందం అధికారులు వనజ, జుబేదా బేగం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తడి, పొడి చెత్త నిర్వహణ పారిశుద్ధ్యం, ఇంకుడుగుంతలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీపీడీ భాస్కర్, ఎంపీఓ మాజిద్, ఏపీఓ కృష్ణమూర్తి, జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్ మురళి, టెక్నికల్ అసిస్టెంట్ మాధవి, పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్‌తో ఎంతో మేలు



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యులు

బీబీనగర్: ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్) ద్రావణంతో ఎంతో ప్రయోజనకారి అని బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాల వైద్యులు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్‌లోని పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఓఆర్‌ఎస్ వారోత్సవాల్లో భాగంగా చిన్నారుల తల్లులకు ఓఆర్‌ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఓఆర్‌ఎస్ తయారీపై ప్రదర్శనలు, ఆరోగ్య నిపుణలతో ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ ఆరోరా, డీన్ సంగీత సంపత్, పీడియాట్రిక్ విభాగాధిపతి సిబాబ్రత్త పట్నాయక్, వైద్యులు మధుసూదన్, మనీషా, నితిన్ జాన్ పాల్గొన్నారు.

● అమ్మానాన్నలకు పాదపూజ



మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వచనం తీసుకుంటున్న విద్యార్థులు - మోత్కూరు

పంటల వివరాల నమోదుకు సర్వే

రాజాపేట : రాష్ట్రంలో పంటల సాగు వివరాల నమోదుకే సర్వే చేస్తున్నామని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ) అధికారులు అన్నారు. మంగళవారం రాజాపేట మండలం రేణికుంట, బేగంపేట గ్రామాల్లో పంటల నమోదు వివరాలను ఎన్‌ఎస్‌ఎస్‌ఓ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేశారు. పంటల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ఓ జాయింట్ డైరెక్టర్ ఎన్‌డీ ప్రమోద్, వ్యవసాయ శాఖ ఏడీ నీలిమ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం ఉప గణాంక అధికారి శ్రీనివాస్, ఎస్‌ఎస్‌ఓ కవితరాణి, ఏపీఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, ఏఈఓలు వినిత తదితరులు పాల్గొన్నారు.

నాగుల పంచమి



నాగుల పంచమి సందర్భంగా మంగళవారం భువనగిరి పచ్చలకట్ట సోమేశ్వరాలయంలోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు - భువనగిరి

తేలిన చేనేత రుణమాఫీ లెక్క

అర్హులుగా 2,355 మంది కార్మికుల గుర్తింపు

- జాబితా సిద్ధం చేసిన అధికారులు
- రూ.లక్ష వరకు మాఫీ కానున్న వ్యక్తిగత రుణం
- జిల్లాలో రూ.18.87 కోట్ల వరకు మాఫీకి అవకాశం



సాక్షి, యాదాద్రి : ప్రభుత్వం ప్రకటించిన చేనేత వ్యక్తిగత రుణమాఫీ అర్హుల జాబితా సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు రుణమాఫీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం రాష్ట్రంలోని నేతన్నల రుణమాఫీ కోసం ప్రభుత్వం ప్రాథమికంగా రూ.33 కోట్ల నిధులు విడుదల చేసింది. ఏప్రిల్ 1, 2017 నుంచి మార్చి 31, 2024 వరకు బ్యాంకుల్లో నేతన్నలు తీసుకున్న రుణాలకు వర్తిస్తుంది. ఈ కటాఫ్ తేది ఆధారంగానే జిల్లాలోని బ్యాంకుల వారీగా అప్పులున్న నేతన్నల వివరాలను జిల్లా యంత్రాంగం సేకరించింది. కలెక్టర్ అధ్యక్షతన గల జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో లబ్ధిదారులు, మాఫీ మొత్తాన్ని ఆమోదిస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయి కమిటీలో రుణమాఫీ ఆమోదం పొందగానే నేతన్నలకు రుణమాఫీ లబ్ధి చేకూరనుంది.

2,355 మందికి రూ.18.87 కోట్ల వరకు..

జిల్లాలో 2,355 మంది చేనేత కార్మికులు అర్హులుగా అధికారులు లెక్కతేల్చారు. రూ.లక్ష వరకు వీరందరికి వర్తించే రుణమాఫీ మొత్తం రూ.18.87 కోట్లుగా తేలింది. అయితే రూ లక్ష కంటే ఎక్కువ ఎంత అప్పు ఉన్నా వారికి ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.లక్ష వరకు మాఫీకానుంది. ప్రాథమిక అంచనా ప్రకారం రుణాలు తీసుకున్న నేతన్నల సంఖ్య ఎక్కువగా ఉంది. జిల్లాలోని 40 బ్యాంకుల నుంచి జౌళి శాఖ అధికారులు వివరాలను సేకరించారు. బ్యాంకులు ఇచ్చిన జాబితా ఆధారంగా వ్యక్తిగత రుణం మాఫీ కానుంది. అత్యధికంగా భూదాన్ పోచంపల్లిలో 900 మంది. పుట్టపాకలో 500 మంది, చౌటుప్పల్‌లో 250 మంది. ఆలేరులో 150 మందితోపాటు జిల్లా వ్యాప్తంగా రుణమాఫీకి అర్హులను అధికారులు గుర్తించారు.

ఆగస్టు 1న బ్యాంకర్ల సమావేశం

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆగస్టు 1న జిల్లాస్థాయిలో బ్యాంకర్ల సమావేశం జరుగనుంది. సభ్యులుగా ఉన్న డీసీసీబీ సీఈఓ, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఆర్‌డీడీ, ఎల్‌డీఎం, డీజీఎం నాబార్డ్, జీఎం ఇండస్ట్రీస్, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి, జిల్లా జౌళి శాఖ అధికారి సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో రుణగ్రస్తుల జాబితాను ఆమోదించి రాష్ట్ర స్థాయి కమిటీకి పంపిస్తారు. అక్కడా ఆమోదంలభించిన వెంటనే నేతన్న ఖాతాల్లో రుణమాఫీ చేస్తారు.

బ్యాంకుల వారీగా వివరాలు సేకరించాం..



జిల్లాలో చేనేత రుణమాఫీ లబ్ధిదారుల జాబితా సిద్ధమైంది. రూ.లక్షలోపు రుణం తీసుకున్న నేతన్నల వివరాలను బ్యాంకుల వారీగా తీసుకున్నాం. పూర్తిగా చేనేత కోసం వ్యక్తిగత రుణం తీసుకున్న వారే 2,355 మంది అర్హులు ఉన్నారు. వీరికి రూ. 18.87 కోట్లు మాఫీ అవుతాయి.
– శ్రీనివాస్, ఏడీ, జౌళి శాఖ

సమసమాజ నిర్మాణమే లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

వలిగొండ : అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన సీపీఐ జిల్లా 4వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో సాగునీటి కాల్వలు, గంధమల్ల రిజర్వాయర్ పూర్తిచేయించేందుకు పోరుబాట పట్టాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిజాన్ని అంతం చేయలేరని అన్నారు. కమ్యూనిస్టులంతా ఒక్క తాటిపైకి వస్తే దోపిడీ వర్గాల రాజ్యాన్ని కూల్చేయవచ్చన్నారు. బీసీ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపినా కేంద్ర ప్రభుత్వం దాన్ని అడ్డుకుంటుందన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లాలో జరగనున్న పార్టీ వంద వసంతాల ముగింపు సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద రాజకీయాలు చేస్తోందన్నారు. దేశంలో కమ్యూనిస్టులకు పూర్వ వైభవం రాబోతోందన్నారు. జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రాంతంలో ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న పరిశ్రమల కాలుష్యాన్ని నివారించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరేలా కృషిచేయాలని కోరుతూ ఎమ్మెల్యే సాంబశివరావుకు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మహాసభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్‌రెడ్డి, బాలగోని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కలకేం కృష్ణ, కొల్లూరు రాజయ్య, ఎండి.ఇమ్రాన్, బచ్చనగోని గాలయ్య, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేశం, కుసుమాని హరిచేంద్ర, ఏశాల అశోక్, బోడ సుదర్శన్, బండి జంగమ్మ, చేడే చెంద్రయ్య, కురిమిద్య శ్రీనివాస్, పాశికంటి లక్ష్మీనర్సయ్య, బంతిని యాదగిరి, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, పులిపాలుపుల మల్లేష్, సాళ్వద్రి రవీందర్ అంబటి అంజయ్య, సుద్దాల సాయికుమార్, బోడిగ సుదర్శన్, బోడ సునీత ఆంజనేయులు పాల్గొన్నారు.



వలిగొండలో నిర్వహించిన పార్టీ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు



26 క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

ముందస్తుగానే.. కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్ : సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. 18 ఏళ్ల తర్వాత జూలై మాసంలో 26 రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడం ప్రాజెక్టు చరిత్రలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడం.. సాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టానికి మూడు అడుగుల దూరంలో ఉండడంతో మంగళవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తుతారని ఆయా మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పర్యాటకులు మంగళవారం సాగర్‌కు భారీగా తరలివచ్చారు. ప్రాజెక్టు పరిసరాల్లో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. క్రస్ట్‌గేట్ల నుంచి నీరు కిందకు దుమికే దృశ్యాలను తమ మొబైల్ కెమెరాల్లో బంధించారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి వెల్లడించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

చౌటుప్పల్ : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై బీజేపీ వైఖరిని తక్షణమే వెల్లడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చౌటుప్పల్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ బిల్లుపై అసెంబ్లీలో తీర్మానం చేసిన సమయంలో బీజేపీ మద్దతు ఇచ్చినప్పటికీ కేంద్రంలో మాత్రం అడ్డుతగులుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ మూలంగా బీసీలు నష్టపోతున్నారని తెలిపారు. నాన్చుడు ధోరణిని విడనాడాలని డిమాండ్ చేశారు. సిగాచి పరిశ్రమ బాధితులకు ఇప్పటికీ పరిహారం అందివ్వకపోవడం సరికాదన్నారు. తక్షణమే బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, మల్లేశం, పెంటయ్య, గోశిక స్వామి, బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాస్‌చారి, ఎండి.పాషా, గంగదేవి పాండు, గోశిక కరుణాకర్, రాగీరు కిష్టయ్య పాల్గొన్నారు.

కాల్వల అభివృద్ధికి నిధులిస్తాం..

- పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు భూసేకరణ పూర్తిచేయండి
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పోచంపల్లి, ఆలేరులో రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్, కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి : పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు త్వరగా భూసేకరణ ప్రక్రియ పూర్తిచేస్తే ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తనకు ప్రియమిత్రుడు, దగ్గరి బంధువు అని, ఆయన కోరిక మేరకే పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాలువలకు నిధులు మంజూరు చేశానన్నారు. అలాగే ఎమ్మెల్యే కోరినట్టుగా అలీనగర్, బొల్లేపల్లి, భీమలింగం కాలువల నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు. కార్యకర్తల కష్టంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలకు గాను 11 స్థానాలు గెలిపించి జిల్లాను రాష్ట్రాన్ని శాసించే స్థాయికి తీసుకొచ్చారని కొనియాడారు. గొప్ప చరిత్ర కలిగిన పోచంపల్లికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఇది.. ఇందిరమ్మ పాలన : ఎమ్మెల్యే కుంభం

మంత్రులు మన దగ్గరిక వచ్చి సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రజాపాలన ఇందిరమ్మ పాలన అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేశంలో మరెక్కడ లేని విధంగా సన్నబియ్యం అందజేస్తున్నామని గుర్తుచేశారు. మూసీ సాగునీటి కాల్వలకు రూ.500ల కోట్ల నిధులు మంజూరు చేసి ప్రత్యేక అభిమానం చూపిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యంతో పేదవారు కడుపునిండా తింటున్నారని పేర్కన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీఎస్‌ఓ రోజా, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, డీటీ నాగేశ్వర్ రావు. ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, భువనగిరి మార్కెట్‌కమిటీ చైర్మన్ రేఖా బాబురావు, జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ అవైస్ చిస్తీ, పోత్నక్ ప్రమోద్‌కుమార్, కాంగ్రెస్‌జిల్లా నాయకులు తడక వెంకటేశం, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు విస్మరించిన బీఆర్‌ఎస్ : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను విస్మరించిందని ఏ ఒక్కరికి ఇల్లు, రేషన్‌కార్డు ఇచ్చిన పాపాన పోలేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు సన్నబియ్యంతో పాటు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.

'గంధమల్ల'ను పూర్తిచేస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రేషన్ కార్డు పంపిణీ చేస్తున్న మంత్రులు ఉత్తమ్, లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు: జిల్లాలోని గంధమల్ల రిజర్వాయర్‌ను సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసి, ఆలేరు నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందిస్తామని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆలేరు పట్టణంలో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రిజర్వాయర్ పూర్తికి రూ.600 కోట్ల నిధులు కేటాయించామన్నారు. భూసేకరణ కోసం రైతులకు చెల్లించేందుకు అదనంగా రూ.27కోట్ల నిధులు ఇరిగేషన్ శాఖ నుంచి త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆలేరులో కొత్తగా 7వేల మందికి రేషన్‌కార్డులను జారీ చేశామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఆలేరు ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పేదల ఆత్మగౌరవానికి ప్రతీక రేషన్‌కార్డుల పంపిణీ అన్నారు. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడమే తన చిరకాల కల అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే ఐలయ్య గొర్రెపిల్లను బహూకరించారు. అనంతరం మంత్రులను ఎమ్మెల్యే, కలెక్టర్‌లు సన్మానించారు. రెవన్యూ డివిజన్‌గా ఆలేరును ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు మంత్రికి వినతి అందజేశారు.

గొర్రెపిల్ల నాకేనా.. : ఉత్తమ్

బహూకరించిన గొర్రెపిల్లను నాకేనా. మీకా అని మంత్రి ఉత్తమ్ సమావేశంలో ఎమ్మెల్యేతో చమత్కారించారు. అదనపు కలెక్టర్ మా నియోజకవర్గ ఓటరే.. కలెక్టర్ మన జిల్లా వాసే అని మంత్రి సరదాగా మాట్లాడి నవ్వులు చిందించారు.

క్లుప్తంగా

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు దొడ్డా పద్మ మృతి



దొడ్డా పద్మ

చిలుకూరు: చిలుకూరు గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య సతీమణి దొడ్డా పద్మ (98) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. బుధవారం చిలుకూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దొడ్డా పద్మ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

బైక్ అదుపుతప్పి మహిళ మృతి



సత్యవతి (ఫైల్)

నకిరేకల్: బైక్ అదుపుతప్పి కింద పడడంతో మహిళకు తీవ్రగాయాలై మృతి చెందింది. ఈసంఘటన మంగళవారం నకిరేకల్ శివారులోని మూసీ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన లోడే సత్యవతి(54), నకిరేకల్‌లో ఉంటున్న తన కుమారుడు ఉపేందర్ దగ్గరకు సోమవారం వచ్చింది. తిరిగి ఓగోడు గ్రామానికి వెళ్లేందుకు ఉపేందర్ తన మిత్రుడికి బైక్ ఇచ్చి ఇంటి వద్ద తన తల్లిని దింపి రమ్మని చెప్పాడు. ఈక్రమంలో బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈప్రమాదంలో సత్యవతి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుమారుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాచారి తెలిపారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించాలి



యూనివర్సిటీలో మొక్కలు నాటుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు, ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

- తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన యూనివర్సిటీలు విద్యార్థులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే ఉత్తమ సాధనంగా ఉండాలని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ఆయనతోపాటు, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, జ్యోత్స్న, శివారెడ్డి బృందం మంగళవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీని సందర్శించి ప్రజా విచారణ చేపట్టారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు, కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ.. ఉత్తమ విద్య, విద్యార్థుల అభ్యున్నతికి యూనివర్సిటీల్లో నైపుణ్యాలను అందించి నైతికత, సమతా భావన, దేశ భక్తిని పెంపొందించే గురుతర బాధ్యత యూనివర్సిటీలపై ఉందన్నారు. యూనివర్సిటీల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విద్యా కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. అంతకు ముందు యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అలువాల రవి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, అరుణప్రియ, సుధారాణి, ప్రొఫెసర్ అంజిరెడ్డి, ప్రొఫెసర్ ఆకుల రవి, ప్రొఫెసర్ రేఖ, మద్దిలేటి, మిర్యాల రమేష్, దోమల రమేష్ పాల్గొన్నారు.

సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులు తమ సమస్యలను పరిష్కరించాలని కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వీస్ క్రమబద్ధీకరణతో పాటు ప్రస్తుత సర్వీస్‌ను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. 250 మందికి పైగా ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు మూడంచెల వేతన విధానం ద్వారా తీవ్ర నష్టం జరుగుందని, ఏజెన్సీ విధానం రద్దు చేయాలని కోరారు.

వీసీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

యూనివర్సిటీకి చెందిన అన్ని వివరాలను వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యా కమిషన్ బృందానికి వివరించారు. యూనివర్సిటీలోని ప్రస్తుత స్థితిగతులను బృందం సభ్యులకు ప్రత్యక్షంగా చూపించారు. అదేవిధంగా విద్యార్థులు తమ హాస్టల్‌లో కల్పించాలని వసతులు, సమస్యలు, పోటీ పరీక్షలకు వెసులుబాటు తదితర వాటిపై కమిషన్ బృందానికి విన్నవించారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యా కమిషన్‌ను కలిసి నాలుగేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వలన ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యా కమిషన్ బృందానికి వివరించారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

● జలపాతం కనువిందు



తెలంగాణ - ఏపీ సరిహద్దులో నాగార్జునసాగర్ సమీపంలో ఎత్తిపోతల వద్ద కనువిందు చేస్తున్న జలపాతం

108 వాహనంలో.. అత్యాధునిక సౌకర్యాలు

- పేషెంట్ ఆరోగ్య పరిస్థితి పరిశీలించేందుకు మల్టీచానల్ మీటర్ సదుపాయం
- అందుబాటులో స్టమక్ క్లీనర్‌తోపాటు, అత్యవసర మందులు, ఇంజెక్షన్లు



108 అంబులెన్స్ వాహనం

నిడమనూరు : అత్యవసర సేవలు అందించే 108 అంబులెన్స్ వాహనంలో ఆధునిక సౌకర్యాలు కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు, పాయిజన్, ప్రసవ సేవలు, అనారోగ్యానికి గురైన వ్యక్తిని వాహనంలో ఆస్పత్రికి తరలించేలోగా పలు అత్యవసర సేవలందించేలా 108 వాహనంలో వసతులు ఏర్పాటు చేశారు. ఇటీవల నిడమనూరుకు ఈ కొత్త అంబులెన్స్ వాహనాన్ని కేటాయించారు.

వాహనంలో ఉన్న వసతులు ఇవీ..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్ ఆరోగ్య పరిస్థితి సమీక్షించేందుకు మల్టీపుల్ చానల్ మానిటర్ ఏర్పాటు చేశారు. దీనితో బీపీ, పల్స్ రేట్, సాచ్యురేషన్ పేషెంట్ కండిషన్ తెలిపేందుకు ఇది దోహదపడుతుంది. అదేవిధంగా పురుగుల మందు తాగి వారికి కడుపులో ఉన్న విషం తొలగించేలా స్టమక్ క్లీనర్ ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదం బారిన పడిన క్షతగాత్రులకు ఉపయోగపడే అత్యవసర మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా పోర్టబుల్ ఆక్సిజన్ సిలిండర్ ఏర్పాటు చేశారు. బాధితుడు శ్వాస తీసుకోవడంతో ఇబ్బందులు తలెత్తితే పోర్టబుల్ ఆక్సిజన్ సిలిండర్ సాయంతో ఆక్సిజన్ అందిస్తారు. ఆస్పత్రికి తరలించే వరకు ఎంతగానో దోహదపడుతోంది. అత్యవసర ప్రసవ సమయాల్లో సేవలందించేలా డెలివరీ కిట్స్ ఉన్నాయి.



ఆక్సీమీటర్‌ను పరిశీలిస్తున్న టెక్నీషియన్



పోర్టబుల్ ఆక్సిజన్ సిలిండర్



స్టమక్ క్లీనర్

గంజాయి కేసులో ముగ్గురు అరెస్టు

- కేజీ 210గ్రాముల గంజాయి స్వాధీనం

నల్లగొండ: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను మంగళవారం వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండకు చెందిన తలమల్ల శివశంకర్, హైదరాబాద్‌కు చెందిన బత్తుల శబరి గిరీష్ రాజస్థాన్‌లోని వివేకానంద గ్లోబల్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు. అదే సమయంలో ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారు. శివశంకర్, నార్కట్‌పల్లికి చెందిన యాస భానుప్రకాష్‌రెడ్డిలు ఇంటర్ నుంచి స్నేహితులు. శివశంకర్ తనకు గంజాయి అవసరం ఉన్నప్పుడు శబరి గిరీష్, భానుప్రకాష్‌రెడ్డిల నుంచి తీసుకునేవాడు. గిరీష్ హైదరాబాద్‌లోని పహత్‌నగర్ నుంచి గంజాయి తెచ్చేవాడు. 2024లో పోలీసులకు పట్టుబడి జైలుకు కూడా పోయారు. శివశంకర్ నల్లగొండ పట్టణంలో గంజాయి అమ్మి పెద్ద మొత్తంలో సంపాదించవచ్చనే ఉద్దేశంతో వారం క్రితం ఈ ముగ్గురు కలిసి హైదరాబాద్‌లో ఓ మహిళ వద్ద కేజీ 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి నల్లగొండకు తెచ్చి ప్యాకెట్లుగా మార్చి అమ్మారు. ఈ నెల 28న మిగిలిన గంజాయిని ముగ్గురు పంచుకుని అమ్మడానికి వెళ్తున్నారు. పోలీసులు సమాచారం మేరకు వారిని పట్టుకున్నారు. వారి నుంచి ఒక కేజీ 210గ్రాముల గంజాయిని, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ సైదులు, గోపాల్‌రావు, సిబ్బంది షకీల్, సత్యనారాయణ, లింగస్వామి, సైదులు, అకిల్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని బోయవాడలో మంగళవారం ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంది. యువతి నల్లగొండలోని బోయవాడలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ప్రకాశం బజార్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తుంది. మంగళవారం యువతి ఇంట్లో విగత జీవిగా పడి ఉంది. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకుని విచారణ కొనసాగిస్తున్నారు. ఎవరైనా హత్య చేశారా.. లేక ఆత్మహత్య చేసుకుందా అనే కోణంలో విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు ఎస్సై సాయిరాం తెలిపారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలు, రూ.2వేల జరిమానా, ఏడుగురికి కలిపి రూ.6,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పేర్కొన్నారు.

సబ్సిడీ యూరియా పక్కదారి!

- డీఈఎఫ్‌ఎల్ సెంటర్‌లో యూరియా బస్తాలను గుర్తించిన ఎస్‌ఓటీ పోలీసులు
- పీఏసీఎస్ నుంచి సరఫరా అయినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్న అధికారులు

చిట్యాల: వ్యవసాయ రైతులకు సబ్సిడీపై చెందాల్సిన యూరియా పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఓ దాబా సమీపంలో నిర్వహిస్తున్న డీఈఎఫ్‌ఎల్ (డిజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్) సెంటర్‌లో వినియోగించేందుకుగాను నిల్వ చేసిన 108 పైగా యూరియా బస్తాలను ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం రాత్రి గుర్తించారు. అనంతరం యూరియా బస్తాలతో పాటు రవాణాకు వినియోగించిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఈ నిల్వ చేసిన సబ్సిడీ యూరియా బస్తాలు గత కొంతకాలంగా పీఏసీఎస్ కేంద్రం నుంచి సరఫరా అయినట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఈ నెల 26న డీఈఎఫ్‌ఎల్ సెంటర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌లు తనిఖీలు చేశారు. తనిఖీ చేసిన నాలుగు రోజులకే అదే సెంటర్ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన యూరియా బస్తాలు దొరికాయి. అంతేకాకుండా చిట్యాల మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్ ఉండగా రైతులకు అందాల్సిన యూరియా పక్కదారి పట్టడంతో పలువురు రైతులు వ్యవసాయశాఖ అధికారుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుర్తించిన యూరియాపై మంగళవారం చిట్యాల పోలీసులను ప్రశ్నించగా పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

రాష్ట్రాన్ని శాసించేది నల్లగొండ జిల్లానే

- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



భూదాన్ పోచంపల్లిలో రేషన్‌కార్డులు పంపిణీ చేసిన అనంతరం సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : ఈ రాష్ట్రాన్ని శాసించేది ఉమ్మడి నల్లగొండ జిల్లాయేనని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెద్దవూర, కట్టంగూరు, భూదాన్ పోచంపల్లి, ఆలేరు, హుజూర్‌నగర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆయా సభల్లో ఉత్తమ్ మాట్లాడుతూ.. 12 ఎమ్మెల్యే స్థానాలకు గాను 11మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించిన కార్యకర్తల త్యాగాలు వెలలేనివన్నారు. రాష్ట్రంలో 84 శాతం జనాభాకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులకు ఎవరికి రేషన్‌కార్డు రాకపోయిన వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అధిక ప్రాధాన్యతను ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, కలెక్టర్లు పాల్గొన్నారు.

3 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

మోతె: అక్రమంగా సరఫరా చేస్తున్న మూడు క్వింటాళ్ల నల్లబెల్లంను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మోతె మండల కేంద్రంలో వెంకటరమణ అనే వ్యాపారి గత కొంత కాలం నుంచి నల్లబెల్లం వ్యాపారం సాగిస్తున్నాడు. మంగళవారం ఆయన తన ఇంట్లోని మూడు క్వింటాళ్ల నల్లబెల్లం ఆటోలో వేసుకుని గోల్‌తండాకు సరఫరా చేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై వినయ్‌కుమార్ తన పోలీసు సిబ్బందితో కలిసి ఆటోను పట్టుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మూడు క్వింటాల నల్లబెల్లం స్వాధీనం చేసుకొని ఆటోను సీజ్ చేశారు. బెల్లం వ్యాపారి వెంకటరమణతో పాటు ఆటో డ్రైవర్ మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

భూ వివాదం.. ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ



భువనగిరి-జగదేవ్‌పూర్ రోడ్డు పై ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

- గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి
- న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు, బంధువుల ధర్నా



భాను (ఫైల్)

భువనగిరి: ఇరువర్గాల మధ్య ఘర్షణలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు మంగళవారం భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో ధర్నాకు దిగారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోటకూరి వెంకటయ్యకు ఇద్దరు కుమారులు తోటకూరి మల్లేష్, తోటకూరి భాను(32) ఉన్నారు. అదే గ్రామానికి చెందిన తోటకూరి బాలనర్సింహకు ఇద్దరు కుమారులు బాలయ్య, మల్లేష్‌లు ఉన్నారు. ఈ నెల 22న మధ్యాహ్నం సమయంలో వెంకటయ్య, ఆయన చిన్నకుమారుడు భాను వ్యవసాయ బావి వద్ద ఉండగా పెద్ద కుమారుడు మల్లేష్ పొలంలో వరాలు తీస్తున్నాడు. భూ తగాదా విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అక్కడే ఉన్న బాలనర్సింహ చిన్న కుమారుడైన మల్లేష్ వెంకటయ్య పెద్ద కొడుకును చూసి తిట్టడం ప్రారంభించాడు. ఇదే సయయంలో బాలనర్సింహ భార్య శంకరమ్మ, చిన్నకుమారుడు మల్లేష్, మల్లేష్ అన్న కొడుకైన అజయ్‌లు కలిసి వెంకటయ్య పెద్ద కుమారుడిని కొట్టారు. బాలనర్సింహ చిన్న కుమారుడు తన వద్ద ఉన్న గొడ్డలితో అక్కడే ఉన్న వెంకటయ్య చిన్న కుమారుడు భాను తలపై దాడి చేశాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటయ్య సైతం గాయపడ్డాడు. వారిని చికిత్స నిమిత్తం భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం భానును హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడికి పాల్పడిన మల్లేష్, శంకరమ్మ, అజయ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

భువనగిరి–జగదేవ్‌పూర్ రోడ్డుపై ధర్నా

న్యాయం చేయాలని భాను కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు భువనగిరి–జగదేవ్‌పూర్ రోడ్డుపై ధర్నాకు దిగారు. సుమారు మూడు గంటల పాటు ధర్నా చేయడంతో రోడ్డుకు ఇరు పక్కల కిలోమీటర్ల కొద్ది వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. పోలీసులు సర్దిచెప్పడంతో గ్రామస్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసీపీ రాహుల్‌రెడ్డి, రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

- వరిసాగులో కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు

పాడిపంట

త్రిపురారం : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఇప్పటికే వరి నాట్లు పూర్తి చేసుకున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద సైతం సాగు నీరు విడుదల కావడంతో ఇప్పటికే నాట్లు పూర్తి చేసుకోగా.. పలు ప్రాంతాల్లో ముమ్మరంగా వరి నాట్లు వేయడంలో బిజీగా ఉన్నారు. వరి పంటల సాగులో రసాయని ఎరువుల వాడకం తగ్గించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రసాయనక ఎరువులు వినియోగించడం వల్ల భూమి సారం దెబ్బతినడంతో పాటుగా పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. రసాయనిక ఎరువల వాడకం తగ్గించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. వరి సాగులో ఎరువులు, పోషకాల యాజమాన్యంపై కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్ర శేఖర్ సూచనలు.



వరి పంట సాగు

- భూసార పరిరక్షణకు రసాయనిన ఎరువుల వాడకం తగ్గించుకుని సేంద్రియ, జీవన ఎరువులు ఉపయోగించుకోవాలి. సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల భూసారం పెరగడమే కాకుండా పోషకాల లభ్యత కూడా పెరుగుతుంది.
- వరి మాగాణుల్లో అపరాలు, జీలుగా, పిల్లి పెసర లాంటి పచ్చి రొట్ట పైర్లను పెంచి పూత దశకు ముందు కలియదున్నడం వల్ల భూసారం పెరగడమే కాకుండా సుమారు 20 నుంచి 25 శాతం వరకు నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులు ఆదా చేయొచ్చు.
- భూసార పరీక్షల ఆధారంగా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వాడుకోవాలి.
- నత్రజని వినియోగాన్ని పెంచుకోవడానికి 50 కిలోల యూరియాకి 10 కిల్లో వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన బంక మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి వరి పొలంలో వేద జల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.
- పురుగులు, మరియు తెగుళ్ల ఎక్కువగా ఉన్నప్పుడు నత్రజని ఎరువు వాడకం తగ్గించుకోవాలి.
- భాస్వరం ఎరువులను పొలం దమ్ములోనే వేసుకోవాలి. దమ్ములో వేయకపోతే నాటు వేసిన పది రోజుల లోపు వేసుకోవాలి.

యూరియా వినియోగంతో చీడపీడల ఉధృతి పెరుగుతుంది

వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే పంటలకు కావాల్సిన పోషకాలను సరైన మోతాదులో సకాలంలో అందించాలి. పొటాష్ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో ఒకేసారి వేసుకోవాలి. యూరియాను ఎక్కువగా వినియోగిస్తే చీడపీడల ఉధృతి పెరుగుతుంది. చీడపీడల వల్ల తాలు కంకులు ఏర్పటి దిగుబడి తగ్గడమే కాకుండా పంట నాణ్యత దెబ్బతింటుంది. ప్రతి రైతు తన పొలంలో మట్టిని ప్రతి రెండేళ్లకు ఒక్కసారైన పరీక్ష చేయించుకొని ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం పెంచుకోవాలి.